కలం
kalamdaily.com
Follow on: Kalamtelugu
ప్రజల గళం...
గురువారం, మార్చి 12, 2026
పేజీలు: 2

360° SINGLE TOPIC
పవర్ డిమాండ్

# వార్ ఎఫెక్ట్
# కరెంట్ షాక్

సిలిండర్ల కొరతతో జనం భయాందోళన

ఇండక్షన్ స్టవ్‌ల వైపు చూపు

ఇప్పటికే సమ్మర్‌తో పవర్ డిమాండ్ పీక్స్

ఇండక్షన్ స్టవ్‌ల వాడకంతో మరింత పెరిగే చాన్స్



ఇరాన్‌లో వార్.. ఇండియాలో తిప్పలు. ఎల్పీజీ గ్యాస్ కోసం జనం క్యూలు. పెట్రోల్, డీజిల్ రేట్లు ఎప్పుడు పెరుగుతాయోనన్న భయాందోళనలు. తెలంగాణలోనూ ఇదే సిచ్యువేషన్! గ్యాస్ కష్టాల నుంచి గట్టెక్కేందుకు జనం ఇండక్షన్ స్టవ్‌ల వైపు మళ్లుతున్నారు. వీటి కొనుగోళ్లు భారీగా పెరిగిపోతున్నాయి. ఫిబ్రవరి నుంచే ఎండలు దంచికొడుతుండటంతో పొద్దస్తమానం ఫ్యాన్లు, ఏసీల వాడకం రెట్టింపైంది. తెలంగాణలో కరెంట్ డిమాండ్ రికార్డు లెవల్‌ను టచ్ చేసింది. దీనికి తోడు ఇండక్షన్ స్టవ్‌ల వాడకం కూడా పెరగడంతో కరెంట్ కష్టాలు తప్పేలా లేవు. ఇప్పటికే టెక్నికల్ ఇష్యూలు అంటూ ఊళ్లలో కోతలు మొదలయ్యాయి. హైదరాబాద్ సహా సిటీల్లోనూ ముందు ఇదే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. వార్ ఎఫెక్ట్‌తో లోకల్‌గా నెలకొన్న పవర్ డిమాండ్‌పై కలం 360 డిగ్రీస్ స్పెషల్...

తెలంగాణ బ్యూరో, కలం



### ఇండక్షన్ స్టవ్‌లతో మరింత పీక్స్‌కు..

సిలిండర్ల ధరలు పెరగడం, అవి టైమ్‌కు దొరక్కపోవడంతో ఎక్కువ మంది కరెంట్ స్టవ్‌లపై ఆధారపడుతున్నారు. ఇండక్షన్ స్టవ్‌లను వినియోగిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో కరెంట్ వినియోగం పెరుగుతోంది. ఎండాకాలంలో సాధారణంగానే కరెంట్ డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఇప్పుడు జనం వంటకు కూడా సిలిండర్లకు బదులు కరెంట్‌నేపైనే ఆధారపడుతుండడంతో పవర్ డిమాండ్ మరింత పీక్స్‌కు చేరే అవకాశం ఉంది.

- భారత్‌లో 1,200 నుంచి 2 వేల వాట్స్ సామర్థ్యం గల ఇండక్షన్ స్టవ్‌లు అందుబాటులో ఉనాయి. వీటిని ఒక్క గంట పాటు వినియోగిస్తే ఒక యూనిట్ నుంచి 2 యూనిట్ల కరెంట్ ఖర్చవుతుంది.
- ఈ లెక్కన ఒక కుటుంబం రోజులో రెండు గంటలు వినియోగించినా నెలకు 60 నుంచి 120 యూనిట్ల కరెంట్ అవసరమవుతుంది.

## సిలిండర్లకు తీవ్ర కొరత


పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎల్పీజీ దిగుమతులపై తీవ్ర ప్రభావం పడింది. భారతదేశ అవసరాలకు కావాల్సిన ఎల్పీజీలో దాదాపు 60% దిగుమతి చేసుకుంటున్నాం. ఈ దిగుమతుల్లో సుమారు 90% హార్ముజ్ జలసంధి ద్వారానే వస్తున్నాయి. ఇప్పుడు ఇరాన్ వార్ కారణంగా హార్ముజ్ జలసంధి ద్వారా నౌకల ప్రయాణం ఆగిపోయింది. దీంతో భారత్‌లో ఎల్పీజీ కొరత ఏర్పడింది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం డొమెస్టిక్, కమర్షియల్ సిలిండర్ల ధరలను పెంచింది. ఉత్పత్తి పెంచాలని కంపెనీలను ఆదేశించింది. దీంతో రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్న భయాందోళన నెలకొంది. గతంలో సిలిండర్ బుక్ చేస్తే ఒకట్రెండు రోజుల్లోనే డెలివరీ అయ్యేది. ఇప్పుడు వారమైనా రావట్లేదు. ఎల్పీజీ కొరత కారణంగా కొన్నిచోట్ల హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడ్డాయి. సరైన టైమ్‌కు సిలిండర్లు దొరక్క గృహ వినియోగదారులూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## కేంద్రం ఆంక్షలు

ఎల్పీజీ కొరత కారణంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. సిలిండర్ల సరఫరాపై ఆంక్షలు విధించింది. గృహావసరాలకు, అత్యవసర సేవలు అందించే ఆస్పత్రులు, విద్యాసంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయిల్ కంపెనీలను ఆదేశించింది. ఒక సిలిండర్ బుక్ చేసుకున్న 25 రోజుల తర్వాతే మరో సిలిండర్ బుక్ చేసుకునేలా నిబంధన తెచ్చింది. కమర్షియల్ సిలిండర్ల సరఫరాపై సమీక్షించడానికి ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందూస్తాన్ పెట్రోలియం కంపెనీల నుంచి ఒక్కొక్కరు చొప్పున ముగ్గురు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో కమిటీ ఏర్పాటు చేసింది.

## కరెంట్‌పై కాస్కేడింగ్ ఎఫెక్ట్

యుద్ధం కారణంగా ఇప్పటికే సిలిండర్ల ధరలు పెరిగాయి. పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరిగే అవకాశం ఉందన్న భయాందోళనలు నెలకొన్నాయి. పెట్రో రేట్లు పెరిగితే.. రవాణా ఖర్చులు పెరిగి, నిత్యావసరాల ధరలూ పెరుగుతాయి. చివరికి ఆ భారం వినియోగదారులపైనే పడుతుంది. దీన్నే 'కాస్కేడింగ్ ఎఫెక్ట్' అంటారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కరెంట్‌పైనా కాస్కేడింగ్ ఎఫెక్ట్ పడే అవకాశముంది. సిలిండర్లు దొరక్క జనం ఎక్కువగా కరెంట్ స్టవ్‌లను వినియోగిస్తే.. పవర్ డిమాండ్ పీక్స్‌కు చేరనుంది.



## డిమాండ్‌కు సరిపడా సరఫరా ఉందా?

రాష్ట్రంలో ప్రతిఏటా కరెంట్ వినియోగం పెరుగుతున్నది. 2022లో 66,203 మిలియన్ యూనిట్లు ఉండగా, అది 2025 నాటికి 84,200 మిలియన్ యూనిట్లకు చేరింది. కరెంట్ వినియోగం పెరుగుతుండడంతో ప్రభుత్వం కూడా ఉత్పత్తిని పెంచుతున్నది. డిమాండ్‌కు సరిపడా సరఫరా చేస్తున్నది.


- రాష్ట్రంలో ప్రతినెల సగటున 6,500 నుంచి 7,000 మిలియన్ యూనిట్ల కరెంట్ వాడకం జరుగుతున్నది. ఇందులో ఎక్కువగా వ్యవసాయం, పరిశ్రమలు, గృహ, వాణిజ్య అవసరాలకు వినియోగమవుతున్నది.
- రాష్ట్రంలో ప్రతిఏటా సగటున 20 శాతం లోపు కరెంట్ గృహ అవసరాలకు వినియోగమవుతున్నది.
- ఇప్పుడు ఇండక్షన్ స్టవ్‌ల వాడకం పెరగడంతో గృహ అవసరాలకు కరెంట్ డిమాండ్ మరో ఐదారు శాతం పెరిగే అవకాశం ఉంది.
- రాష్ట్రంలో కొత్తగా డేటా సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు పలు కంపెనీలు ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ నేపథ్యంలో కరెంట్ వినియోగం మరింత పెరుగుతుంది.
- సాధారణంగా ఎండాకాలంలో డిమాండ్ ఎక్కువగానే ఉంటుంది. అందుకు ఎప్పుడూ ప్రభుత్వం సిద్ధంగానే ఉంటుంది. కానీ ఇప్పుడు యుద్ధం కారణంగా పెరుగుతున్న డిమాండ్ ఊహించినది కాదు. ఆ డిమాండ్‌ను తట్టుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.
- సరిపడా ఉత్పత్తి, సరఫరా చేయలేని పరిస్థితులు నెలకొంటే.. కరెంట్ కోతలు తప్పవు. ఇప్పటికే ఊళ్లలో టెక్నికల్ ఇష్యూల పేరుతో కరెంట్ కోతలు నడుస్తున్నాయి.

## రికార్డులు బ్రేక్

తెలంగాణలో విద్యుత్ వినియోగం, విద్యుత్ డిమాండ్‌లో సరికొత్త రికార్డులు నమోదవుతున్నాయి. ఈసారి ఎండాకాలం ఇంకా రాకముందే పవర్ డిమాండ్, వినియోగం పీక్స్‌కు చేరాయి. ఏప్రిల్, మే నెలల్లో డిమాండ్, వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది.

- రాష్ట్ర చరిత్రలోనే 2026 మార్చి 9న అత్యధికంగా 335.89 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. ఒక్క రోజులో ఇంత పెద్ద మొత్తంలో కరెంటు వాడటం గత 12 ఏళ్లలో ఇదే తొలిసారి. ఇంతకుముందు 2026 మార్చి 3న కూడా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గరిష్ట స్థాయికి చేరుకుంది. ఆ రోజు 325.56 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది.
- తెలంగాణ చరిత్రలోనే 2026 మార్చి 3న అత్యధికంగా 18,139 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. అంతకుముందు 2025 మార్చి 20న 17,162 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ రికార్డయింది.

తెలంగాణలో అత్యధిక విద్యుత్ డిమాండ్ లెక్కలివీ (మెగావాట్లలో)..








## ఇండక్షన్ స్టవ్‌లు ఔటాఫ్ స్టాక్

దేశంలో ఇండక్షన్ స్టవ్‌లు దొరకడం లేదు. సిలిండర్ల కొరత కారణంగా జనం ఎక్కువగా వాటినే కొనుగోలు చేస్తున్నారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ లాంటి పెద్ద పెద్ద నగరాల్లో ఇండక్షన్ స్టవ్‌ల స్టాక్ షార్టేజ్ ఉంది. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, స్విగ్గీ, బ్లింకిట్, జెప్టో లాంటి క్విక్ కామర్స్ సైట్లలోనూ అందుబాటులో లేవు. అన్నింట్లోనూ ఔటాఫ్ స్టాక్ అని చూపిస్తున్నది.



### ఇబ్బందులు రానివ్వం

ఎల్పీజీ వినియోగదారులు ఆందోళన చెందవద్దు. ఎల్పీజీ సరఫరాలో అంతరాయాలు ఉన్నప్పటికీ, దేశ అవసరాలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకున్నాం. హార్ముజ్ జలసంధి కాకుండా, వేరే మార్గాల్లో దిగుమతి చేసుకుంటున్నాం. దేశీయంగానూ 25 శాతం ఉత్పత్తి పెరిగింది. ఎప్పటిలాగా రెండున్నర రోజుల వ్యవధిలోనే సిలిండర్లను డెలివరీ చేస్తాం.

- సుజాత శర్మ, పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ